క్లుప్తంగా

వినాయక చవితికి పందిరి రాట



నెహ్రూ నగర్‌లో చవితి రాట వేస్తున్న మహిళలు

ఆరిలోవ: ఆరిలోవలో వినాయక ఉత్సవాల సందడి ప్రారంభమైంది. ఉత్సవాల్లో భాగంగా గణేశుడి పందిళ్ల కోసం రాటలు వేస్తున్నారు. జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి నెహ్రూనగర్‌లో శుక్రవారం నెహ్రూనగర్ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ రాట వేశారు. సంఘం సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొని శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షునిగా మళ్లీ రవీంద్రే



సాక్షి, విశాఖపట్నం : భారతీయ జనతా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షునిగా మేడపాటి రవీంద్ర మరోసారి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శుక్రవారం పలు జిల్లాల అధ్యక్షులను మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ జిల్లాకు సంబంధించి ప్రస్తుతం అధ్యక్షునిగా ఉన్న రవీంద్రనే కొనసాగిస్తూ ఆదేశాలిచ్చారు. కాగా రవీంద్ర 2019 డిసెంబర్ 31న మొదటిసారి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వడం పట్ల పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపారు.

హార్ట్ అండ్ హెరిటేజ్ కేంద్రం ప్రారంభం



భారతీయ సాంప్రదాయ దుస్తుల్లో విశాఖ వేలీ స్కూల్ విద్యార్థులు

ఆరిలోవ : విశాఖ వేలీ స్కూల్‌లో ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ హెరిటేజ్ ఇన్‌టాక్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, ఇన్‌టాక్ కో కన్వీనర్ సురేంద్ర కుమార్ మాట్లాడుతూ మన సంస్కృతి, సనాతన ధర్మం, చారిత్రక కట్టడాలు, బాంధవ్యాల గురించి తెలుసుకోవడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా నందోత్సవం



పండ్లతో స్వామి ప్రభుపాదకు అభిషేకం

బీచ్‌రోడ్డు: నంద మహారాజుకు పుత్రుడు జన్మించాడనే ఆనందంతో ప్రజలకు విందు ఇచ్చే నందోత్సవాన్ని శుక్రవారం హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్ నిర్వహించిన ఈ నందోత్సవంలో శ్రీకృష్ణ భగవానుడికి రకరకాల వంటకాలతో నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా గురుపూజ

హరే కృష్ణ మూమెంట్ వ్యవస్థాపక గురువు భక్తి వేదాంత స్వామి ప్రభుపాద జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సప్తనదుల నుంచి సేకరించిన జలాలు, పళ్ల రసాలు, పంచామృతం, పంచగవ్యాలతో అంగరంగ వైభవంగా అభిషేకం నిర్వహించారు. ప్రభుపాద జీవిత విశేషాలను హరే కృష్ణ మూమెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించన భక్తదాస భక్తులకు వివరించారు.

3 వసతి గృహాలు ప్రారంభోత్సవం నేడు

- చూడచక్కగా ముస్తాబైన హాస్టళ్లు
- ప్రారంభించనున్న గవర్నర్
- విద్యార్థుల అందుబాటులోకి మరిన్ని మౌలిక సదుపాయాలు



భారత్ జీ 20 ప్రెసిడెన్సీ హాస్టల్



విశ్వేశ్వరయ్య హాస్టల్ భవనం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేళ మూడు వసతి గృహాలు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. తొలిసారిగా ఏయూకు వస్తున్న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శనివారం ఈ హాస్టల్స్ ప్రారంభించనున్నారు. ఈ భవనాలు ప్రారంభమైతే వర్సిటీలో విద్యార్థులకు అధునాతన వసతులతో హాస్టల్స్ అందుబాటులోకి రానున్నాయి.

పూర్వ విద్యార్థుల సహకారంతో.. విశ్వేశ్వరయ్య హాస్టల్

ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఎం.విశ్వేశ్వరయ్య హాస్టల్ సముదాయం చూడచక్కగా ముస్తాబైంది. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న ఈ వసతి గృహాన్ని గవర్నర్ ప్రారంభించనున్నారు. సుమారు రూ.7.5 కోట్ల వ్యయంతో ఐదు అంతస్తుల్లో ఈ భవనం నిర్మిస్తున్నారు. తొలి దశలో రూ.3.75 కోట్లు వ్యయంతో మూడు అంతస్తుల నిర్మాణం పూర్తి చేశారు. దీనిలో 48 గదులు నిర్మించారు. 150 మంది విద్యార్థులకు వసతి అందించే విధంగా ఇంజినీరింగ్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం స్వయంగా ఈ భవనాన్ని నిర్మించి ఏయూకు బహూకరిస్తోంది. వచ్చే సంవత్సరం మరో రెండు అంతస్తులను నిర్మిస్తారు. ఈ భవనానికి అవసరమైన యూజీడీ వ్యవస్థ, ప్రాంగణం చుట్టూ సుందరీకరణ, రోడ్లు నిర్మాణం అదనంగా చేపడుతున్నారు.

విదేశీ విద్యార్థుల కోసం.. 'భారత్ జీ 20 ప్రెసిడెన్సీ' అంతర్జాతీయ విద్యార్థులకు ఉపయుక్తంగా ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరం ఎదురుగా భారత్ జీ 20 ప్రెసిడెన్సీ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. విదేశీ విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని నిర్మించారు. ఈ వసతిగృహంలో 44 గదులను నిర్మించారు. వర్సిటీలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య వెయ్యి దాటింది. పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన హాస్టల్ నిర్మించారు.

శతాబ్ది క్లాసిక్ హాస్టల్

భారత ప్రభుత్వం అందిస్తున్న నిధులతో రెండు అంతస్తుల్లో ఈ హాస్టల్‌ను నిర్మించారు. మొత్తం ఐదు అంతస్తుల నిర్మాణానికి ఉపయుక్తంగా ఫౌండేషన్ నిర్మించారు. దీనిని రూ 2.కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతో నిర్మించారు. ఈ భవనంలో విద్యార్థులకోసం 60 గదులు అందుబాటులోకి రానున్నాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గడప గడపకు కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్‌రోడ్డు : రాజకీయలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 28వ వార్డులో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం పని చేస్తున్నారన్నారు. గత రాజకీయ నాయకులు స్వలాభం కోసం రాజకీయాలు చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలకు మంచి చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి ఆర్టిస్టు పావెల్



పావెల్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీహెచ్ నరసింగరావు

మద్దిలపాలెం : సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ ఆర్టిస్టు పావెల్ ఆదర్శమూర్తి అని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. పీఠాపురం కాలనీలో గల పార్టీ కార్యాలయంలో శుక్రవారం పావెల్ మూడవ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి నిబద్ధతతో పని చేశారన్నారు. ఆయన సేవలకు, సమర్థతకు ఎన్నో అవకాశాలు వచ్చాయన్నారు. వాటిని తృణప్రాయంగా వదిలి పార్టీకి పని చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ కార్యవర్గ సభ్యుడు బి.గంగారావు, కుమార్, పద్మా, కె.ఎం.శ్రీనివాస్, చలపతి, జ్యోతీశ్వరరావు, కుమార మంగళం పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం



చేతివృత్తుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాయల వెంకటరెడ్డి

ఆరిలోవ : దీన్‌దయాళ్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం ఆవరణలో సంఘమిత్ర సంస్థ ఆధ్వర్యంలో చేతి వృత్తుల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రభుత్వ బాలుర గృహాలలో ఉండే బాలురకు చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. అనంతరం సంస్థ నిర్వాహకుడు సూరిబాబు మాట్లాడుతూ ఇక్కడ జీవనోపాధి అందించే ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర చేతి వృత్తుల్లో బాలురకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బి.సత్యనారాయణ, ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ, పలువురు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఎస్ఎఫ్ఎస్ స్కూల్ యాజమాన్యం

మద్దిలపాలెం : వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరు కావాలని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను స్కూల్ ప్రిన్సిపాల్ పి.మనోజ్ తదితరులు ఆహ్వానించారు. నగరానికి విచ్చేసిన గవర్నర్‌ను శుక్రవారం వారు కలిసి పుష్పగుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. స్కూల్ ప్రతిష్టను గవర్నర్‌కు వివరించి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ కార్యక్రమంలో కళా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమణమూర్తి, వంకా శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'యూ జీనియస్' విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న శాలివాహన్

బీచ్‌రోడ్డు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన యూ జీనియస్ నేషనల్ జనరల్ అవేర్‌నెస్ క్విజ్ కాంపిటీషన్ 2023 బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ డైరెక్టర్ శాలివాహన్ ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పరీక్షలకు ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల నుంచి 110 పాఠశాలలకు చెందిన 652 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో టింపనీ సీనియర్ సెకండరీ స్కూల్ విద్యార్థుల బృందం విజేతగా నిలిచింది. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ భాస్కర్ రావు, డిప్యూటీ జోనల్ హెడ్ సంతోష్ ప్రభు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్' పథకంతో సింహగిరికి మహర్దశ



స్కీమ్‌కు సంబంధించిన ప్రణాళికను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.55 కోట్ల ప్రసాద్ పథకం నిధులతో సింహగిరికి మహర్దశ పడుతుందని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రసాద్ పథకం పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను ఆయన శుక్రవారం సింహాచలం దేవస్థానంతో అధికారులతో కలిసి పరిశీలించారు. దేవదాయశాఖ, దేవస్థానం, టూరిజంశాఖ అధికారులతో పనులు జరిగే ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తి స్థాయిలో వినియోగపడేలా అభివృద్ధి పనులు జరగాలని, అంతేకాని ఏ పనీ వృథాగా పోకూడదని సూచించారు. ఆలయ ఉత్తర ప్రాంగణంలో ఉన్న ప్రదేశంలో ఈశాన్యం మూలన యాగశాలను నిర్మించే విషయంపై వైదికుల సూచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అలాగే ఆలయ ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న సువిశాల ప్రదేశంలో క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై చేయాలా...వద్దా అన్న విషయంపై పరిశీలన జరిపారు. మాస్టర్‌ప్లాన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. కొండదిగువ పురాతన పుష్కరిణి సత్రాన్ని తొలగించి ఆ స్థానంలో జీప్లస్–ఫైవ్ కింద ఆధునిక సదుపాయాలతో సత్రాలను నిర్మిస్తామన్నారు. పుష్కరిణి సత్రం మధ్యలో ప్రస్తుతం ఉన్న పురాతన మండపాన్ని అలేగే ఉంచుతామని తెలిపారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు.అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. దేవస్థానం ఈవో కార్యాలయ భవనం కూడా పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాత అడవివరం వైపు నుంచి వచ్చే మార్గంలో ఉన్న రెండో టోల్‌గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన స్థలాన్ని పర్యాటకశాఖకు కేటాయిస్తామన్నారు. అలాగే సింహగిరిపై ఉన్న మ్యూజియాన్ని కమిషనర్ సందర్శించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో త్రినాథరావు ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ సీఈ సీఎస్ఎన్ మూర్తి, ఈఈ రమేష్, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏడీసీ రామచంద్రమోహన్, డీసీ సుజాత, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, దేవస్థానం అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 27,28,29 తేదీల్లో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. 27న ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) దినోత్సవం, 28న సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి ప్రారంభోత్సవం, 29న అకడమిక్ సెషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కాగా ఏఎంసీలో వైద్య విద్య అభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ బ్లాక్ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు బ్లాక్ నిర్మాణ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.రవిరాజ్ తెలిపారు.

సీపీ త్రివిక్రమ్ వర్మకు ఉత్కృష్ట సేవా పతకం

మరికొంతమందికి కూడా..

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ప్రతిష్టాత్మక ఉత్కృష్ట సేవా పతకం లభించింది. ఆయనతో పాటు జిల్లాలో ముగ్గురు సీఐలను, ఒక ఏఎస్ఐతో పాటు 14 మంది హెచ్‌సీలు, 14 మంది కానిస్టేబుళ్లను ఈ పతకానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఒక ఎస్ఐతో పాటు 16 మంది హెచ్‌సీలు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన వారు..

దువ్వాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటలీలా రావు, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం టి.ఇమాన్యుయల్ రాజు, కంచరపాలెం ఏఎస్ఐ కె.కనకరాజు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకోనున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.జీవన్‌కుమార్(సీఏఆర్), జి.వి.రమణ(గోపాలపట్నం ట్రాఫిక్), ఎం.బాలరాజు(పీఎం పాలెం క్రైం), టి.వసంతరావు(సీఎస్‌బీ), జె.ఎం.ఎం.రెడ్డి(పద్మనాభం), జి.శ్రీనివాసరావు(త్రీటౌన్), ఎస్.శ్రీనివాసరావు(దువ్వాడ), డి.సురేష్‌కుమార్(దువ్వాడ క్రైం), ఎ.రమేష్‌కుమార్(దువ్వాడ ట్రాఫిక్), పి.జయసీలన్ (ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్), జి.శ్రీహరి(మల్కాపురం), కె.ప్రసాద్ (మల్కాపురం), టి.కామేశ్వరరావు(ఆనందపురం క్రైం)తో పాటు ఏసీబీ హెచ్‌సీ టి.కొండలరావు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారు. అదే విధంగా కానిస్టేబుళ్లు జి.ప్రసాద్(ఏఆర్), కె.ఎన్.స్వామి(ఏఆర్), జి.శ్రీనివాసరావు(ఏఆర్), వి.దశరావు(ఏఆర్), ఎం.గోవిందరావు(ఏఆర్), పి.సన్యాసిరావు(ఏఆర్), ఎన్.బి.వెంకటేశ్వర్లు(వన్‌టౌన్ క్రైం), ఇ.మునిరాజు(ఏఆర్), ఎస్.ఎరిబాబు (ఏఆర్), బి.శ్రీధర్(ఏఆర్), ఎం.వీరబాబు(ఏఆర్), కె.చిన్నయ్య(ఏఆర్), ఎం.ప్రసాదరావు(ఏఆర్), పి.చిన్న బొజ్జయ్య ఎంపికయ్యారు.


అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన వారు..

న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పి.రాజు, హెచ్‌సీలు కె.వైకుంటరావు (ఏఆర్), ఆర్.మాధవరావు(ఏఆర్), టి.రాము (ఆనందపురం ట్రాఫిక్), జె.వెంకటరవి(ఏఆర్), పి.వరహాలు(దువ్వాడ), ఎ.రమణారావు(సీసీఎస్), జి.శ్రీనివాసరావు(టూ టౌన్ ట్రాఫిక్), కె.బాబా అమర్ శేఖర్ (సీఎస్‌బీ), కె.ఈశ్వరరావు(గాజువాక క్రైం), వి.కనకరావు(ఏఆర్), ఎస్.కె.సుభాన్(సీఎస్‌బీ), జి.రామారావు(ఏఆర్), బి.ఎస్.మూర్తి(ఎంపీపీ)తో పాటు 16వ బెటాలియన్ హెచ్‌సీలు బి.రామానుజులు, పి.కోటేశ్వరరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌లో హెచ్‌సీ ఎం.సన్యాసిరావు ఈ పతకానికి ఎంపికయ్యారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ మకుడి-సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ సంబంధిత ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రయాణికుల మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారుల తెలిపారు. ఈ నెల 20 నుంచి 25 వరకు విశాఖలో బయల్దేరే విశాఖ-న్యూఢిల్లీ(20805) ఏపి ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20నుంచి 25వ తేదీ వరకు న్యూఢిల్లీలో బయల్దేరే న్యూఢిల్లీ- విశాఖ (20806)ఏపీ ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 14, 21వ తేదీల్లో బయల్దేరే విశాఖ-గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న గాంధీదాంలో బయల్దేరే గాంధీదాం-విశాఖ (20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 22,25వ తేదీల్లో విశాఖలో బయల్దేరే విశాఖ-హజరత్ నిజాముద్దీన్ (12803)స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20,24వ తేదీల్లో హజరత్ నిజాముద్దీన్‌లో బయల్దేరే హజరత్ నిజాముద్దీన్- విశాఖ (12804)స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, టిట్లాఘడ్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న పూరిలో బయల్దేరే పూరి-ఓఖా (20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం, టిట్లాఘడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్, వార్ధా మీదుగా ప్రయాణిస్తుంది.

నాటక రంగం అభివృద్ధిలో గరికపాటి కృషి ఎనలేనిది



డాక్టర్ గరికపాటి రాజారావుకు నివాళులు అర్పిస్తున్న ప్రజానాట్య మండలి సభ్యులు

అల్లిపురం : ఆధునిక నాటక రంగం అభివృద్ధిలో డాక్టర్ గరికపాటి రాజారావు కృషి ఎనలేనిదని ప్రజానాట్యమండలి ప్రతినిధి పి.కృష్ణన్న అన్నారు. అల్లిపురంలోని నీలం సంజీవరెడ్డి భవన్‌లో శుక్రవారం డాక్టర్ గరికపాటి రాజారావు 60వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు చిరంజీవి, జి.కాసులరెడ్డి, బి.శివ తదితరులు పాల్గొని గరికపాటి రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రజా నాట్య మండలి జిల్లా కార్యవర్గ సభ్యుడు క్షేత్రపాల్, జిల్లా కార్యదర్శి ఎస్.అప్పారావు, దేవుడమ్మ, లక్ష్మణరావు, పోలారావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ముగిసిన శ్రీకృష్ణాష్టమి



అభిషేకం నిర్వహిస్తున్న సాంబాదాస్ ప్రభూజీ



ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణులు, జగన్నాథ, సుభద్ర, బలభద్ర స్వామిని పట్టువస్త్రాలు, వివిధ వర్ణాల పూలతో ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం విశేష అభిషేకాలు నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని శ్రీకృష్ణ లీలలను భక్తులకు వివరించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

వర్షాభావ పరిస్థితుల్లోను నిరంతర విద్యుత్



సమావేశంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

దొండపర్తి : వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసినట్లు ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీస్ సమావేశ మందిరంలో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి విశాఖలో అన్ని ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా అత్యధికంగా 1616 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు అయినట్లు వివరించారు. విద్యుత్ లోటును సర్దుబాటు చేసేందుకు పరిశ్రమల విద్యుత్ వినియోగదారులకు ఇచ్చిన నోటీసులు ఉపసంహరించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో విద్యుత్ సరఫరా పరిస్థితి మెరుగుపడడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం ఎస్ఈజెడ్ నుంచి కొంత మంది హెచ్‌టీ వినియోగదారులు విద్యుత్ అంతరాయాలపై సందేహాలు వ్యక్తపరచగా వాటిని అధికారులు నివృత్తి చేశారు.

ప్రభుత్వ బాలికల కళాశాలలో ప్రథమ చికిత్స దినోత్సవం

దాబాగార్డెన్స్ : ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ (సెట్విస్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బీవీఎస్ ప్రసాద్‌చే సీపీఆర్, స్నేక్‌బైట్, డాగ్ బైట్, కాలిన గాయాలకు ప్రథమ చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు.

10న ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

మద్దిలపాలెం: రాష్ట్ర, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు స్వీకరించిన వారిని ఈనెల 10వ తేదీన బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ, గాంధీ సెంటర్ సంయుక్తంగా సత్కరిస్తాయని ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. డాక్టర్ బుల్లయ్య కళాశాల ప్రాంగణంలో గల గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర ఉత్తమ అవార్డు పొందిన ఉమా గాంధీ, కె.వి.ఎస్.సుబ్రహ్మణేశ్వరరావు, కె.రాంబాబు, సురేష్‌కుమార్‌లను ఈ సందర్భంగా సత్కరిస్తామన్నారు.

నేడు వెలమ ప్రతిభా పురస్కారాల ప్రదానం

మురళీనగర్: మురళీనగర్–మాధవదార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలమ సామాజిక వర్గ విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తామని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 2023లో పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మురళీనగర్‌లోని ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.